క్లుప్తంగా

రెజ్లర్ల ఆందోళనకు ఐద్వా మద్దతు



సత్తెనపల్లి: ఢిల్లీలో రెజ్లర్ల ఆందోళనకు ఐద్వా మద్దతు తెలిపింది. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కె.నగేష్‌ను ఐద్వా మహిళలు కలసి వినతి పత్రం అందించారు. రెజ్లర్లను వేధింపులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు గద్దె ఉమశ్రీ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మరియమాత జన్మదిన వేడుకలు

పెదకూరపాడు: స్థానిక ఆర్‌సీఎం సంఘం ఆధ్వర్యంలో బుధవారం మరియమాత జన్మదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముగ్గురు రాజులు దేవాలయంలో విచారణ గురువులు రెవరెండ్ పుట్టి సుందరరాజు ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు భక్తులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. చివరి రోజు మేరి మాత విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు.

పొగాకు వాడకంతో పలు అనర్థాలు



పెదకూరపాడు: పొగాకు వినియోగం అనేక వ్యాధులకు మూలమని 75 త్యాళ్లూరు వైద్యాధికారి సుంకర ప్రియాంక తెలిపారు. 75 త్యాళ్లూరు, అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు వాడకంతో పలు అనర్థాలు ఉన్నాయని తెలిపారు. పొగాకు క్యాన్సర్‌కు కారణమని, దానికి దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యామల, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ వెలిగొండారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



అమరావతి: మండల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం రాత్రి దిడుగు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో రూ. 20లక్షలతో పూర్తి చేసిన సిమెంట్ రోడ్లు, సైడ్ కాల్వల్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు భవిరిశెట్టి హనుమంతరావు, బ్రహ్మారెడ్డి, రోశయ్య, గ్రామ సర్పంచ్ వింతా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దేశ పౌరులంతా సమానులే..



నకరికల్లు: రాజ్యాంగం ప్రకారం దేశ ప్రజలందరికీ సమాన హక్కులున్నాయని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి ఎన్. నిరీక్షణ తెలిపారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కండ్లకుంట ఎస్సీ కాలనీలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-17 ప్రకారం అంటరానితనం నేరమని తెలిపారు. ప్రతి పౌరుడికీ రాజ్యాంగం ప్రాథమిక హక్కులు కల్పించిందని, వాటికి భంగం కలిగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. షెడ్యూల్ కులాల వారిని కించపరచడం నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్. సురేష్, ఏవో దేవదాసు, ఈవోపీఆర్డీ గిరిధర్, విద్యుత్ ఏఈ రూపస్ దానియేల్, ఏఎస్ఐ కోటేశ్వరరావు, కంఠమనేని కోటయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

పిడుగురాళ్ల: అనుమతులు లేని విత్తనాల్ని విక్రయిస్తే సహించేది లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో జె.వాసంతి తెలిపారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాల్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో, వ్యవసాయ శాఖ సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ పట్టణంలోని ఓ షాపులో సర్టిఫికెట్ లేకుండా అమ్ముతున్న పత్తి విత్తనాలను నిలుపుదల చేశామని చెప్పారు. వీటి విలువ రూ. 3,36,548 ఉంటుందని తెలిపారు. అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూ సేకరణలో అవినీతి చేసే కర్మ పట్టలేదు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 119.21 ఎకరాలు కొనుగోలు చేసి పేదలకు పట్టాలిచ్చాం
- నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశాం తప్పా ఎక్కడా పైసా ఆశించలేదు
- అవినీతి చేసేట్లు ఉంటే నిరూపించండి
- ఆరోపణలకు లెక్క చేయాల్సిన అవసరం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, కో- ఆప్షన్ మెంబర్లు

సత్తెనపల్లి: నియోజకవర్గంలో 7,761 మంది పేదల ఇళ్ల పట్టాల కోసం ప్రభుత్వ భూమి 90.68 ఎకరాలు, ప్రైవేట్ భూమి 119.21 ఎకరాలు కొనుగోలు చేసి పంపిణీ చేశామని, భూసేకరణలో అవినీతి చేసే కర్మ తనకు పట్టలేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎక్స్ అఫీషియో హోదాలో మంత్రి అంబటి హాజరయ్యారు. 7వ వార్డు జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ మురుగునీటి శుద్ధి కర్మాగారం నిమిత్తం సేకరిస్తున్న భూమి ఎవరి పేరుపై ఉంది? గతంలో ఎవరి పేరుపై ఉందంటూ ప్రస్తావించగా.. కమిషనర్ కొలిమి షమ్మీ వివరణ ఇచ్చారు. పట్టణంలో రెండు వైపులా వచ్చే అవుట్‌ఫాల్ కలిసే చోట మురుగునీటి శుద్ధి కర్మాగారానికి గాను నిర్మలానగర్ ఏరియాలో సర్వే నంబర్ 77/2లో 0.24 ఎకరాలు, 85/3లో 2.24 ఎకరాలు, 87/బీ2లో 1.52 ఎకరాలు వెరసి నాలుగు ఎకరాలు కావాల్సి ఉందన్నారు. అక్కడ నిర్మాణానికి అనువుగా లేదని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించడంతో ప్రైవేట్ భూమి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ విలువ ప్రకారం రూ.8.88 కోట్లకు ప్రభుత్వ గ్రాంట్‌తో కొనుగోలు చేసేందుకు ప్రతిపాదించినట్లు వివరించారు. జాయింట్ కలెక్టర్ పరిశీలించి ధర రికమండ్ చేస్తారని, తరువాత కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వెళుతుందని చెప్పారు. ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు పంపుతుందని, దీనిలో భూసేకరణకు సంబంధించిన అంశం మొత్తం రెవెన్యూ యంత్రాంగం చూస్తుందని తెలిపారు. కౌన్సిలర్ సుమన్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేసేందుకు యత్నించగా మంత్రి అంబటి రాంబాబు జోక్యం చేసుకొని మాట్లాడారు. ఎన్నో ఎకరాలు భూసేకరణ చేశామని, నేరుగా రైతుల ఖాతాల్లో నగదు వేశామన్నారు. భూములు ఆ రోజుకి ఎవరి తరఫున, ఎవరి పేరుమీద రిజిస్ట్రేషన్ ఉందో వాటి ప్రకారం డబ్బులు వేస్తామని చెప్పారు. దీనిలో ఏదో అవినీతి జరిగింది..అన్యాయం జరిగిందని బురదజల్లే కార్యక్రమాలు బయట చేసుకోండని చెప్పారు. దీనిలో అంబటి రాంబాబు అవినీతి చేశాడని, రూ.8.88 కోట్లు కాజేశాడని కొన్ని పత్రికలు రాస్తున్నాయని, వాటిని లెక్కచేయనని స్పష్టం చేశారు. భూసేకరణ అంతా రెవెన్యూ యంత్రాంగం చేసుకుంటుందని, ఎవరి పేరుతో ఉంటే వారి ఖాతాలో డబ్బులు పడతాయని వివరించారు. నియోజకవర్గంలో 119.21 ఎకరాలు భూసేకరణ చేసి పేద ప్రజానీకానికి పట్టాలు ఇచ్చామన్నారు. ఎక్కడన్నా అవినీతి జరిగితే నిరూపించండంటూ సవాల్ విసిరారు. అనంతరం 31వ వార్డు కౌన్సిలర్ తురకా మేరిగ్రేస్ మాట్లాడారు. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు మంత్రి అంబటి పరామర్శ



సత్తెనపల్లి: గుంటూరు నగరంలోని ప్రైవేట్ వైద్యశాలలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సత్తెనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగూర్ మీరాన్‌ను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం పరామర్శించారు. ఆరోగ్య వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు సహారా మౌలాలి, మహీ ఉన్నారు.

నాడు- నేడు పనుల పరిశీలన



స్లాబ్ సెంట్రింగ్‌ను పరిశీలిస్తున్న డీఈఈ కాశిరెడ్డి

అందుకూరు(క్రోసూరు): మండలంలోని అందుకూరు ఎంపీయూపీ పాఠశాలలో నాడు- నేడు రెండో విడతలో నిర్మిస్తున్న రెండు అదనపు తరగతి గదుల స్లాబ్ పనుల్ని బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కాశిరెడ్డి పరిశీలించారు. పనులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తొలి విడతలో మంజూరైన రూ.30 లక్షలతో తొమ్మిది పనులు పూర్తి చేసినట్లు హెచ్‌ఎం కృష్ణంరాజు తెలిపారు. రెండో విడతలో అంగన్‌వాడీ భవనానికి కలిపి రూ.29.50 లక్షలు మంజూరు కాగా, వాటితో రెండు అదనపు తరగతి గదులు నిర్మించినట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ జంగా సౌభాగ్య రూ.లక్ష ఆర్థిక సాయంతో ఆవరణలో చిల్డ్రన్ ప్లే పార్క్ ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం వివరించారు. తమ పాఠశాలలో మండలంలోనే అత్యధికంగా 175 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని తరగతుల్లో డిజిటల్ బోధనలు ప్రారంభమైనట్లు డీఈఈ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్ద జంగా నవీన్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వి.నాగలక్ష్మి, వైస్ చైర్మన్ అశోక్, ఏఈ శివకుమార్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డు ద్వారా రుణం పొందే అవకాశం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భవానీశంకర్

ముప్పాళ్ల: కౌలు రైతు కార్డు ద్వారా బ్యాంకు నుంచి రుణసాయం పొందవచ్చని తహసీల్దార్ ఎం.భవానీ శంకర్ తెలిపారు. ముప్పాళ్ల, చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రాల్లో కౌలురైతు గుర్తింపు కార్డులపై బుధవారం గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ భవానీశంకర్ మాట్లాడుతూ కౌలు రైతులంతా ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. కార్డు వల్ల భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, కేవలం 11 నెలలు మాత్రమే పంట సాగు పత్రం వర్తిస్తుందని వివరించారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయా గ్రామ సభల్లో సర్పంచులు సతీష్, గాయత్రి, ఆర్‌ఐ పవన్ కుమార్, వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవతల విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న మంత్రి అంబటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం, దేవరంపాడు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన నూతన దేవాలయాలు, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు స్థానికులతో కలసి బుధవారం పాల్గొన్నారు. ముందుగా అనుపాలెంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీమదేల్‌పరమేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మంత్రి అంబటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు.

వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జీవ ధ్వజ స్తంభానికి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం దేవరంపాడులో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శివలింగం, శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠలో మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు , సీనియర్ లాయర్ పక్కాల సూరిబాబు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జీవధ్వజ స్తంభానికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వారి వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత, సర్పంచ్‌లు సానికొమ్ము వెంకటసుబ్బమ్మ, ప్రత్తిపాటి దీనమ్మ, పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, దేవరంపాడు దేవాలయ కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రైల్వే గేట్ వైర్ కట్

- రెండు గంటల సేపు నిలిచిన ట్రాఫిక్
- తరచూ అంతరాయంతో వాహనదారులకు అవస్థలు



మరమ్మతులు నిర్వహిస్తున్న రైల్వే సిబ్బంది

పిడుగురాళ్ల: రైల్వే గేట్ పోల్ వైర్లు తెగిపోవడంతో సుమారు రెండు గంటల పాటు పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. జానపాడు రోడ్డులో ఉన్న రైల్వే గేట్ వద్ద బుధవారం ఉదయం 9 గంటల నుంచి సుమారు 11 గంటల వరకు రెండు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక వైపు రైళ్ల రాక పోకలతో, మరో వైపు నిలిచిపోయిన వాహనాలతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వాహన దారులు రైల్వే గేట్ దాటకుండా పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. కారంపూడి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రేల్వే గేట్ వద్దనే పిడుగురాళ్ల ప్రయాణికుల్ని దించి తిరిగి అక్కడి నుంచి వెనుదిరిగాయి. మొత్తం మీద రెండు గంటల తర్వాత మరమ్మతులు పూర్తవ్వడంతో ట్రాఫిక్‌ను వదిలారు. ఇక్కడ తరచూ రేల్వే గేట్ మరమ్మతులకు గురికావడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాజుపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అనుపాలెం సమీపంలోని కోల్డ్‌స్టోరేజీ వద్ద గుంటూరు-మాచర్ల రహదారిపై బుధవారం జరిగింది. మండలంలోని దేవరంపాడుకు చెందిన జెల్డి కోటేశ్వరరావు, అరుణ దంపతుల కుమారుడు కార్తిక్(17) అనుపాలెం సమీపంలోని హాలో బ్రిక్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. దేవరంపాడులో విగ్రహ ప్రతిష్ఠకు బైక్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై పడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్‌ఐ ఎం. నారాయణ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

7న ఆలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

దాచేపల్లి: మండలంలోని గామాలపాడులో ఈ నెల 7న నాయకురాలు నాగమ్మ నిర్మించిన చెన్నమల్లికార్జునస్వామి ఆలయ పునరుద్ధరణ పనులకు, శ్రీరాజరాజేశ్వరిదేవి సమేత శ్రీమహారాజ రాజేశ్వర స్వామి దేవస్థానం పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ పనుల్నిబుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ జంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గామాలపాడు సమీపంలోని నాగులేరు ఒడ్డున 18 ఎకరాల్లో నాడు పల్నాటి తొలి మహిళా మంత్రి నాయకురాలు నాగమ్మ చెన్నమల్లికార్జునస్వామి దేవాలయాన్ని నిర్మించారని తెలిపారు. దాన్ని పరిరక్షించి పల్నాటి చరిత్రను ప్రజలకు చెప్పేందుకు పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో శివలింగ ప్రతిష్ట, ఏకశిల నాగేంద్రస్వామి విగ్రహంతో పాటు పలు దేవతామూర్తుల ఉప ఆలయాలు నిర్మిస్తామని తెలిపారు. నాలుగు దిక్కులా గాలి గోపురాలు ఉంటాయన్నారు. వీటిల్లో ప్రధాన రాజ గోపురం ఎత్తు 272 అడుగులు ఉంటుందని ఆయన వివరించారు. ఆధ్యాత్మిక ధ్యాన, యోగా కేంద్రాలు, వేద విద్యాలయం, గోశాల, యాత్రికుల వసతి సముదాయాలు కూడా నిర్మించేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్సీ జంగా చెప్పారు. పల్నాటి చరిత్ర వైభవాల్ని నేటి తరానికి చాటి చెప్పేందుకు మ్యూజియం కూడా నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రధాన రాజ గోపురం నిర్మాణ శైలితో దేశంలోనే అతిపెద్ద గోపురంగా ప్రసిద్ధికెక్కుతుందని తెలిపారు. శంకుస్థాపనలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ అధికారులు పాల్గొంటారని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చిన్నారి గుండె ఆపరేషన్‌కు ఆర్థిక సాయం



మాచర్ల: పేదలకు సాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ముస్లిం సేవా సమితి అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు.పట్టణంలోని ఓ చిన్నారికి గుండె ఆపరేషన్ నిమిత్తం బుధవారం ఆయన రూ. 15వేలు అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేదలకు సాయమందిస్తున్నట్లు చెప్పారు. చిన్నారికి ఆర్థిక సాయం చేసేందుకు దాతలు ముందుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముస్లిం సేవా సమితి వైస్ ప్రెసిడెంట్ షేక్ రహమాన్ పాల్గొన్నారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలు



సత్తెనపల్లి: సూపర్ స్టార్ కృష్ణ 81వ జయంతి వేడుకలు పట్టణంలోని ఫ్యాన్స్ నాయకుడు బాలనాగు శివ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి, కటకం సుధాకర్, కొబ్బరికాయల సుబ్బారావు, సుభాని, సహారా మీరా, చందలూరి రంగా, వల్లెం చెన్నకేశవ, సైదా, కూరపాటి శ్రీను నజీర్, బిన్ని,సయ్యద్ మాబు, ప్రసాద్, నాగేశ్వరరావు, కటకం కోటేశ్వరరావు, శ్రీను, చేపూరి హనుమంతరావు, 108 మాస్టారు, అన్నం మురళి, మహబూబ్ సుభాని, దేవరశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు

బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెంలో బుధవారం శ్రీ సీతారామాంజనేయస్వామి విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు పాల్గొని, దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు వేద పండితులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు.. ఆలయ ప్రతిష్టతో గ్రామంలో సందడి నెలకొంది. గ్రామస్థులంతా ఐక్యంగా ఆలయాన్ని నిర్మించుకొన్నారు. భక్తులు పెద్దఎత్తున దేవతామూర్తుల్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, వైస్ ఎంపీపీ మరియదాసు, సర్పంచ్ దేసు బ్రహ్మం, ఎంపీటీసీ చిట్టెంశెట్టి శివనాగమణి, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, నాయకులు రామకోటినాయక్, చినతిరుపతయ్య, మేళం భాస్కరరావు చిలుకూరి శ్రీను, భోజ్యా నాయక్, భోడ్కా నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలోని పద్మావతి, గోదాదేవీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం తొమ్మిదో వార్షికోత్సవానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం హాజరయ్యారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్ రహీం, మర్రి కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, షేక్ ముస్తఫా, దొడ్లేరు గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన



ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్న ఉపాధ్యాయులు

పెదకూరపాడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉత్తమ బోధన అందుతుందని మండలంలోని 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సేవల గురించి బుధవారం వారు తల్లిదండ్రులకు వివరించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఈ ఏడాది పదో తరగతిలో జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద, మంచి తరగతి గదులు, ఉత్తమ ఉపాధ్యాయులతో బోధన గురించి వివరించారు. సీబీఎస్ఈ సిలబస్‌తో పాటు అటల్ ల్యాబ్, డిజిటల్ క్లాస్ రూం, స్మార్ట్ ఫోనులో విద్యా బోధన, స్పోర్ట్స్... ఇలా అనేక సేవలు అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, సాంబశివరావు, దత్తతేశ్వరరావు, హెబ్సిబా, మూర్తి , బాజీ ఖాన్, ఏసుబాబు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మాలపాడులో శ్రీశంభులింగేశ్వరస్వామి ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి, పార్వతీదేవి, ధ్వజ స్తంభ, చండీశ్వర, నందీశ్వర, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీవేణుగోపాలస్వామి, ఆదిత్యాది నవ గ్రహాల్ని ప్రతిష్ఠించారు. అనంతరం స్వామికి శాంతి కళ్యాణం, రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు.

సీసీఆర్సీ చట్టంలో మార్పులు చేయాలి



తహసీల్దార్ నగేష్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

సత్తెనపల్లి: సీసీఆర్సీ (క్రాప్స్ కల్టివేటర్ రైట్స్ కార్డు) చట్టంలో మార్పులు చేయాలని, భూ యజమాని అనుమతితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కె.నగేష్‌ను కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ యజమాని సంతకం నిబంధన తొలగించి పంట సాగు హక్కు పత్రం చట్టానికి సవరణ చేయాలని కోరారు. ఈ- క్రాప్ బుకింగ్ చేయాలని, భూమి లేని ఓసీ కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసాను రూ. 25 వేలకు పెంచాలని, కౌలు రైతులకు, చిన్న, సన్నకారు రైతులందరికీ రుణమాఫీ చేయాలని విన్నవించారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు, కౌలు రైతు కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని కోరారు. రెక్కలు ముక్కలు చేసుకుని అప్పులు తెచ్చి అందరికీ అన్నం పెట్టే కౌలు రైతుల్ని పాలకవర్గాలు తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నాయని తెలిపారు. కౌలు రైతుల భవిష్యత్తు కోసం, వ్యవసాయాన్ని కాపాడటం కోసం రాష్ట్రవ్యాప్తంగా జరిగే జాతాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండల కేంద్రంలో జూన్ 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. 11,12 తేదీల్లో తోట్లవల్లూరు మీదుగా వల్లూరుపాలెం, మద్దూరు, చోడవరం, విజయవాడ ప్రకాశం బ్యారేజీ, ఉండవల్లి సెంటర్ మీదుగా మంగళగిరి సీసీఎల్ఏ ఆఫీస్ వరకు జరిగే పాదయాత్రలో కౌలు రైతులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దుగ్గి మేరమ్మ, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు చలవాది లక్ష్మీనారాయణ, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బగ్గి వెంకటేశ్వర్లు, మక్కపాటి నరసింహారావు, రావూరి పూర్ణచంద్రరావు, బొల్లేపల్లి రామారావు, షేక్ హుస్సేన్బా, అనూష, సుజాత, వెంకయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.